నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ జి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బౌద్ధనగర్ పరిధిలోని వారాసిగూడ కౌసర్‌మసీదు, బాలాజి కమ్యూనిటీహాల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు, జామై ఉస్మానియా పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ, లలితానగర్ ప్రాంతాల్లో 11 నుంచి 1.30 గంట వరకు, ఆజామాబాద్ కే పరిధిలోని రామ్‌నగర్, శ్రీనివాస టెక్స్‌టైల్స్ ప్రాంతాల్లో 2.30 నుంచి 5 గంటల వరకు, రాంనగర్ పరిధిలోని టీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్‌మిల్ ప్రాంతాల్లో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఎస్పీ భారతికి వరల్డ్ తెలుగు కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం

చిక్కడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖతార్ దేశం దోహా నగరంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించే 9వ అంతర్జాతీయ తెలుగు కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ప్రముఖ నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమి కౌన్సిల్ సభ్యురాలు డా.ఎస్‌పి భారతికి ఆహ్వానం అందింది. ఈ మేరకు కాన్ఫరెన్స్‌లో జరిగే అంతర్జాతీయ సెమినార్‌లో భారత్ తెలుగు లిటరేచర్‌పై ప్రసంగించనున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర: పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక బీదర్‌కు చెందిన కె.ఆదిత్యరెడ్డి(25) ప్రైవేట్ ఉద్యోగి. నగరానికి వచ్చి డబీర్‌పుర- మలకపేట రైల్వే స్టేషన్ల నడుమ గురువారం పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన రైలు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిత్యరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పఠాన్‌బస్తీలో నిత్యం డ్రైనేజీ సమస్య

● రోడ్డుపై మురుగునీటి ప్రవాహం ● ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు





పఠాన్‌బస్తీలో రోడ్డుపై పొంగుతున్న మురుగునీరు

ముషీరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని పఠాన్‌బస్తీలోని అమీర్‌గరీబ్ షాపు నుంచి మార్టినెంట్ హైస్కూల్ వరకు నిత్యం మురుగునీరు రోడ్డుపై పారుతోంది. కాలువలా మురుగు పారుతుండడంతో ఆ రోడ్డుపై ప్రజలు నడవలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేస్తే జలమండలి అధికారులు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్పా సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మురుగు నీరు రోజూ రోడ్డుపై పారుతోంది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో తీవ్ర దుర్వాసన వెలువడుతోందని ప్రజలు వాపోతున్నారు. దోమల సమస్య కూడా విపరీతంగా ఉందని తెలిపారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మ్యాన్‌హోల్స్ నిండినప్పుడే మురుగు తొలగింపు

పఠాన్ బస్తీలోని అమీర్‌గరీబ్ షాపు వద్దగల డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ వారంలో 4, 5 రోజులు నిండి మురుగునీరు రోడ్డుపై పారుతుంది. జలమండలి సిబ్బంది సమస్య ఉత్పన్నమైనప్పుడు వచ్చి ఏయిర్‌టెక్ యంత్రంతో మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తూ తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారు. అప్పటివరకు మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు ప్రవహించడం ఆగిపోయినప్పటికి మళ్లీ ఒకటి రెండు రోజుల్లో మురుగు సమస్య మళ్లీ మొదలవుతోంది.

జీహెచ్‌ఎంసీ, జల మండలి అధికారుల మధ్య చర్చ

పఠాన్‌బస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇటీవల చర్చించుకున్నారు. ఇరు శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు



డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారులకు సైతం సమస్యను వివరించాం. అసవరమైన చోట కొత్త పైప్‌లైన్‌లు వేస్తున్నాం.

- జలమండలి డీజీఎం మోహన్‌రాజ్

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం



పఠాన్‌బస్తీలోని మురుగు సమస్యను ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని జలమండలి ఎండీకి ఫిర్యాదు చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరాం. భవిష్యత్‌లో మురుగు సమస్య తలెత్తకుండా కృషి చేస్తున్నాం.

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



పఠాన్‌బస్తీలో దశాబ్ద కాలంగా డ్రైనేజీ సమస్య నెలకొంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మురుగునీరు రోడ్డుపై చేరినప్పుడు తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు.

- నాగరాజు, స్థానికుడు

లక్ష్మీగణపతి ఆలయంలో గుడ తైలాభిషేకం

చిక్కడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో గుడ తైలాభిషేకం కన్నులపండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈవో లక్ష్మారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.



గుడ తైలాభిషేకం కార్యక్రమంలో భక్తులు, అర్చకులు



ప్రత్యేక పూజా కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

అంబర్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ వేడుకలో భాగంగా నాలుగో రోజు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, దేవస్థాన సేవా సమితి అడ్వయిజర్ డీవీరెడ్డి, సమితి అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఆర్.రాజు, ప్రధాన కార్యదర్శి బి.మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, కార్యనిర్వహక కార్యదర్శి కిషోర్, బొడ్రాయి పునః నిర్మాణ కమిటీ కన్వీనర్ చింతల శ్రీనివాస్ ముదిరాజ్, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మానగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడి నియామకం



గంగపుత్ర సంఘం నూతన అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్‌తో సభ్యులు

ముషీరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మానగర్ గంగపుత్ర సంఘం నూతన అధ్యక్షుడిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బిజ్జి కనకేష్‌కుమార్ రెండో సారి నియమితులయ్యారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యసలహాదారులుగా పెంటం రాములు, సలహాదారులుగా కృష్ణయ్య, నాగేష్, నర్సయ్య, యాదగిరి, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, రాజయ్య, దేవేందర్, స్వామి, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శిగా రాజు, కార్యదర్శులుగా శివకుమార్, శేఖర్, ఎస్ రాజు, యాదగిరి, ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా శివకుమార్, సహాయకార్యదర్శులుగా బాలకృష్ణ, నరేష్, ము రళీ, పూస రాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సత్యనారాయణ, అశోక్, యాదగిరి, రాజు, ప్రొగ్రామ్ కన్వీనర్‌లుగా చంద్రయ్య, మురళీకృష్ణ, గోపాల్‌లు నియమించారు.



సాయికుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బిజ్జి కనకేష్‌కుమార్

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలను వివరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహాత్మానగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు గంగపుత్రులు చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. అర్హులైన మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిషరీష్ ఫెడరేషన్ డైరెక్టర్ నాగమణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో దళితులకు స్టాల్స్ కేటాయించాలి



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నేతలు

నల్లకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే నుమాయిష్‌లో దళిత పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శనకు అవకాశం కల్పించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కదారం వినయ్‌కుమార్, కాన్ఫడరేషన్ ఆఫ్ ఆర్గనైజ్డ్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూర్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సి.ఆర్.మునిస్వామిలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సంఘం నాయకులు డిప్యూటీ సీఎంను ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడుతూ.. సెర్ప్, మెప్మా సంస్థలు మహిళా స్వయం సహాయక సమూహాలను, చేనేత పరిశ్రమల శాఖ చేనేత వస్త్రాల ప్రదర్శన అమ్మకం కోసం నుమాయిష్‌లో ఉచితంగా స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నారని, కానీ దళిత పారిశ్రామికవేత్తల అవకాశం కల్పించలేదని విన్నవించారు. ఈ విషయంపై స్పందించిన డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో వేదన్‌కుమార్, పెర్మిలా గౌతమ్ పాల్గొన్నారు.

కచ్చామోరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

చిక్కడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం నుంచి జవహర్‌నగర్ వరకు 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న కచ్చామోరీ పనులను వెంటనే పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆమె కచ్చామోరీ పనులను చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలిసి పరిశీలించారు. ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నేతలు ఉమేష్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, సత్యం, సురేందర్, సురేష్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉచిత కంటివైద్య శిబిరం ప్రారంభం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. వనస్థలిపురం ఆటోనగర్‌లోని హైదరాబాద్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారి ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో టాటా గ్రూప్ సంస్థ అయిన టైటాన్ ఐ ప్లస్, హెచ్‌జీటీఏ సహకారంతో ఔటర్ టోల్ వసూళ్ల ఏజెన్సీ ఐఆర్‌బీ సంస్థ గురువారం నిర్వహించింది. వాహనదారులకు కంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలను అందించారు. శనివారం వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని, కళ్లు సరిగా కనిపించనప్పుడు కళ్లజోడు పెట్టుకోవడానికి మొహమాటపడకూడదని తెలిపారు. కళ్లద్దాలతో సరిపోక అంతకంటే ఎక్కువగా ఎవరికైనా శుక్లాలు ఏర్పడితే వాటికి ఆపరేషన్లు చేయించడానికి కూడా ఇక్కడి నుంచి రిఫర్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని డ్రైవర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, హెచ్‌జీటీఏ అధ్యక్షుడు అజయ్‌శర్మ, హెచ్‌జీటీఏ ఉపాధ్యక్షుడు వినీల్, ఎన్‌ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్నల్ గిరీశ్వర్, హెచ్‌జీసీఎల్ డీజీఎంలు చంద్రశేఖర్, రిజ్వాన్, ఏజీఎం మీనాక్షి, ఐఆర్‌బీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు

హైదరాబాద్‌సిటీ: ఏపీ మహిళాభివృద్ధి సొసైటీ (ఏపీమాస్) ఆధ్వర్యంలో శుక్రవారం యూసఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్ మే)లో ఉత్తమ స్వయం సహాయక సమాఖ్యలకు జాతీ య పురస్కారాలు అందజేస్తున్నారు. ఏపీ మాస్ 23 ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంగా మహిళా సాధికారత సాధన, పేదరికం తగ్గుదల కోసం కృషి చేస్తుందని నిర్వాహకులు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు జరుగనున్న కార్యక్రమానికి 22 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా స్వయం సహాయ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

'సమగ్ర కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలి'

చిక్కడపల్లి: సమగ్ర కుటుంబసర్వేకు అందరూ సహకరించాలని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని కవేలిగ్రౌండ్., జవహర్‌నగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రకళశంకర్, అభిషేక్ కెన్నడీ, శీలం సత్యనారాయణ, మారిశెట్టి నర్సింగ్‌రావు, సాయికీర్త్, కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సంగీత సాధన, సేవాభావం కలవారికి ప్రశాంతత సాధ్యం

చిక్కడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంగీత సాధన, ఆస్వాదనతో పాటు సేవాభావం కలవారికి ప్రశాంతత సాధ్యమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. విజయ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభ కళాదీక్షితులు కళావేదికలో ప్రముఖ గాయకుడు పేరి నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎనిమిది గంటల పాటు నిరాటంకంగా గానలహరి నిర్వహించారు. నాగేశ్వరరావు సతీమణి పేరి విజయలక్ష్మీతో కలిసి ఘంటసాల గాయనీమణులు సుశీల, జానకిలతో కలిసి పాడిన నాటి చిత్రాలలోని పాటలను మధురంగా గానం చేశారు. ప్రసన్న, విజయకుమార్, సౌమ్య, కృష్ణవేణి, రామనరసింహం, శ్రీవాసన్, రమణమూర్తి, శ్రీధర్‌లు నాటి, నేటి పాటలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న కళాభిమాని పేరి కామేశ్వరరావు, గాయనీ గాయకులు విజయకుమార్, ప్రసన్న తదితరులు పేరి నాగేశ్వరరావును సన్మానించారు. నాగేశ్వరరావు నిత్యం చిరునవ్వుతో విసుగు చికాకు లేకుండా ఉండేందుకు కారణం ఇతరులకు సహాయపడే మానవీయ విలువలు తెలిసినవారు, సంగీత ప్రియులు కావడమే కారణమని అన్నారు.



నివాళులర్పిస్తున్న కళా జనార్ధనమూర్తి, రోశిరెడ్డి

నేటి కథకులకు చిరస్మరణీయుడు కాళీపట్నం రామారావు

చిక్కడపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు కథ ఉన్నతిని తెలిపేందుకు జీవితం చివరి వరకూ తపించిన కాళీపట్నం రామారావు నేటి కథకులకు చిరస్మరణీయుడని ప్రముఖ నటుడు రోశిరెడ్డి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గానసభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా ప్రఖ్యాత కథా రచయిత కాళీపట్నం రామారావు శత జయంతి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రోశిరెడ్డి మాట్లాడుతూ.. కాళీపట్నం రామారావు నిరంతర కృషితోనే తెలుగు కథను జాతీయ స్థాయిలో నిలిపిందన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూజ.. కారా మాస్టారుగా పేరొందిన రామారావు రాసిన యజ్ఞం కథ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నారు. ఆయన ఆలోచనా విధానం మార్క్సిజం మానవతావాదం అని చెప్పారు. శ్రీకాకుళంలో ఆయన తన సంపాదనంతా వెచ్చించి కథాకుటీరం నెలకొల్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాభిమానులు శంకరప్రసాద్, భాస్కరరావు, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేయాలి

బర్కత్‌పుర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని తెలంగాణ మాదిగ సంఘాల కూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై ఆర్టికల్ 341 సవరిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. గురువారం బర్కత్‌పురలోని మహాకూటమి రాష్ట్ర కార్యాలయంలో దండోరా ధర్మపోరాట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు అమలు పరిచే వరకూ ఈ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులు బాలకిషన్‌రావు, పలు సంఘాల నేతలు గొల్లపల్లి దయానంద్, సంగీతం రాజలింగం, అంబటి కృష్ణమూర్తి, నల్లా సూర్యప్రకాష్, పూసపాటి శ్రీనివాస్, బిషప్ స్వామిదాస్, ఆర్.మోజేస్, సనాఉల్లాఖాన్, జంగన్నగౌడ్, రామదాసు మాదిగ, విశ్వజన కళామండలి అధ్యక్షుడు మాష్టార్జీ తదితరులు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

మాలలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్ర

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు



మాట్లాడుతున్న మన్నె శ్రీధర్‌రావు, రాష్ట్ర కన్వీనర్ బల్వంత్‌రావు

నల్లకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ, ప్రాంతీయ పార్టీలు మాల జనాబాను తక్కువ చూపించి మాలలకు దక్కాల్సిన రిజర్వేష న్ల ఫలాలు దక్కకుండా చేసి అణచివేసే కుట్రకు పాల్పడుతున్నాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రా ష్ట్ర చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, రాష్ట్ర కన్వీనర్ పి.బల్వంత్‌రావులు ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాలలపై జరుగుతున్న దాడిని ఎదుర్కోవడానికి రాజకీయ ముసుగును తొలగించుకుని ఉద్యమబాటకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలోని మాల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన కుట్ర నేపథ్యంలో బాధితులు ఇంట్లో కూర్చుంటే దోపిడీదారులు చెప్పిందే వేదమవుతుందన్నారు. మాల, మాల అనుబంధ కులాలు ఇకనైనా కార్మోన్ముఖులు కావాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనకు అనుబంధ కులాలు పెద్దఎత్తున తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కో-కన్వీనర్లు తాలుకా రాజేష్, మేకల సత్యనారాయణ పాల్గొన్నారు.

సికింద్రాబాద్-వాడిల మధ్య రైల్ ట్రాక్ కోసం స్థల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య నాలుగు లైన్‌లుగా విస్తరించే పనులు చేపట్టడానికి అవసరమైన స్థలాన్ని సేకరించే పనులను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. ప్రధానంగా సనత్‌నగర్ నుంచి వాడి స్టేషన్‌ల మధ్య సుమారు 173.18 కిమీ దూరం భవిష్యత్ అవసరాలకు మూడు నుంచి నాలుగు లైన్‌ల ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు రైల్వే బోర్డు ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టడానికి అనుమతించింది. ఈ మేరకు తెలంగాణ లోని హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని కలబురిగి జిల్లాల్లో ప్రతిపాదించిన భూమిని ఆయా జిల్లా కలెక్టర్‌ల సహకారంతో సేకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఆర్ఆర్‌బీ కోసం 42 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్: ఈనెల 25 నుంచి 29వ తేదీల మధ్య జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం వేర్వేరు ప్రాంతాల నుంచి 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలియజేశారు. నవంబరు 24, 25, 26, 28, 29వ తేదీల్లో గుంటూరు- సికింద్రాబాద్(07101), 24, 25, 26, 28వ తేదీల్లో సికింద్రాబాద్- గుంటూరు (07102), కరీంనగర్-కాచిగూడ (07103), కాచిగూడ- కరీంనగర్ (07104), 23న నాందేడ్- తిరుపతి (07105), 24న తిరుపతి- నాందేడ్ (07106), 24, 26, 28, 29వ తేదీల్లో కాకినాడ టౌన్- తిరుపతి (07107), తిరుపతి- కాకినాడ టౌన్ (07108) 24, 25, 26వ తేదీల్లో కాచిగూడ- కర్నూల్‌సిటీ (07109), కర్నూల్ సిటీ- కాచిగూడ (07110), 24, 25, 26, 27వ తేదీల్లో హుబ్లీ- కర్నూల్ సిటీ (07315), 25, 26, 27, 28వతేదీల్లో కర్నూల్‌సిటీ-హుబ్లీ(07316) రైళ్లను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

'మత్తు' నిర్మూలనలో యువత భాగస్వామ్యం

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల కట్టడి, నిర్మూలనలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) యువతను భాగస్వామ్యం చేస్తోంది. అందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో వచ్చే వారం రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు నవంబరు 27, 28న రెండు విడతలుగా టీజీ న్యాబ్ అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల్ని కూకటివేళ్లతో నిర్మూలించేందుకు ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు వెల్లడించారు.

పర్యాటకుల కోసం గోల్డెన్-చారియట్ లగ్జరీ రైలు

హైదరాబాద్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన ప్రయాణంతో విహారయాత్రలకు వెళ్లి వచ్చే పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 80 మంది విలాసవంతంగా ప్రయాణించేందుకు అనువుగా 13 డబుల్ బెడ్‌ల క్యాబిన్‌లు, 26 ట్విన్ బెడెడ్ క్యాబిన్‌లతో పాటు అత్యంత ఆధునిక సదుపాయాలతో ఐఆర్‌సీటీసీ ప్రత్యేక గోల్డెన్ చారియట్ లగ్జరీ రైలులో విహారయాత్రలకు వెళ్లి వచ్చేందుకు ఐఆర్‌సీటీసీ సిద్ధం చేసింది. వినోదం, విశ్రాంతి కోసం లగ్జరీ రైలులో ప్రత్యేకంగా స్పా, స్పాథెరపీలను ఆస్వాదించేందుకు ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. అలాగే రుచి, నలపాక్ పేరుతో రెండు అద్భుతమైన రెస్టారెంట్‌లు అందుబాటులో ఉన్నట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ బెంగళూరు నుంచి బందీపూర్, మైసూర్, హళేబీడు, చిక్కమంగళూరు, హంపి, గోవా సందర్శించిన తర్వాత తిరిగి ఆరు రోజుల్లో బెంగళూరు చేరుకునేందుకు అనువుగా టూర్ ప్యాకేజీ ఖరారు చేశారు. అలాగే జువెల్స్ ఆఫ్ సౌత్ ప్యాకేజీలో బెంగళూరు నుంచి మైసూర్, కాంచీపురం, మహాబలిపురం, తంజావూరు, చెట్టినాడ్, కొచ్చిన్, చేరాలా ప్రాంతాలను సందర్శించి ఆరు రోజుల్లో తిరిగి బెంగళూరుకు చేరుకునేందుకు వీలుగా మరో ప్యాకేజీ ప్రకటించారు. గోల్డెన్ చారియెట్ లగ్జరీ రైలు డిసెంబర్ 14న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, డిసెంబర్ 21న జువెల్స్ ఆఫ్ సౌత్, 2025 జనవరి 4, ఫిబ్రవరి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక, టూర్ ఫిబ్రవరి 15న జువెల్స్ ఆఫ్ సౌత్ టూర్, మార్చి 1న ప్రైడ్ ఆఫ్ కర్ణాటక టూర్ నిర్వహిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. వివరాలకు 91 8585931021, లేదా www.goldenchariot.org, Email:goldenchariot@ irctc.com సంప్రదించాలని రైల్వే అధికారులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వంపై పార్టీ శ్రేణులు కృషి చేయాలి

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వంపై పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు పి.సాయిబాబా సూచించారు. గురువారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారిని పార్టీవైపు ఆకర్షితులను చేయాలని సూచించారు. 22వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ పొలిట్‌బ్యూరో మెంబర్ ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్, బక్కని నర్సింహులు హాజరవుతారని తెలిపారు.

25 వేల సభ్యత్వమే లక్ష్యం

బర్కత్‌పుర: అంబర్‌పేట నియోజకవర్గంలో 25 వేల టీడీపీ సభ్యత్వం చేర్పించడమే లక్ష్యం అని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ వెల్లడించారు. ఐదు డివిజన్లలో ఒక్కొక్క డివిజన్‌లో 5 వేల సభ్యత్వాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



మాట్లాడుతున్న పి.సాయిబాబా